



కూల్.. కూల్ కూలర్లు

సండే స్పెషల్

మంచిర్యాలటౌన్: ఎండ నుంచి ఉపశమనానికి, వేసవి తాపం నుంచి రక్షణకు ప్రతీఇంట్లో కూలర్లు దర్శనమిస్తుంటాయి. జిల్లా వ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో షాపుల వద్ద కొనుగోలు దారులతో సందడి నెలకొంటుంది. ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసి అమ్ముతుండగా ఒక్కో కూలర్ ధర సైజును బట్టి రూ.1500 నుంచి రూ.15వేల వరకు లభిస్తున్నాయి. ఏటా జిల్లా వ్యాప్తంగా కూలర్ల అమ్మకాలతో రూ.10కోట్ల వరకు బిజినెస్ జరుగుతుండగా, కొందరు వేసవిలో మాత్రమే కూలర్లను విక్రయిస్తుండగా, మరికొందరు కాలంతో సంబంధం లేకుండా విక్రయాలు జరుపుతున్నారు.

క్లుప్తంగా

'నేనెవరికీ బినామీని కాదు'



విలేకరులతో మాట్లాడుతున్న దీపక్

నస్పూర్: తానెవరికీ బినామీని కాదని, సీసీసీ నస్పూర్ సుగుణాకర్‌తో ఎలాంటి పరిచయం లేదని నస్పూర్ పట్టణానికి చెందిన దాస్యపు దీపక్ తెలిపారు. ఏసీబీ అధికారులకు చిక్కిన ఎస్సైపై ఈ నెల 18న కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం తెలిసిందే. ఈ కేసులో దీపక్‌ను ఎస్సై బినామీగా పేర్కొన్నారు. శనివారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో దీపక్ విలేకరులతో మాట్లాడారు. ప్రభంజన్‌పై క్షుద్రపూజల కేసు నమోదు చేయకుండా ఉండడానికి రూ.30వేలు లంచం డిమాండ్ చేశారని, వాటిని ఎస్సై బినామీగా పేర్కొంటూ తనకు ఫోన్ పే ద్వారా బాధితులు చెల్లించారనేది అవాస్తవమని తెలిపారు. ప్రభంజన్ మిత్రుడు సాయిరెడ్డికి రూ.30 వేలు ఇవ్వాలని ప్రభంజన్ సోదరి తనకు ఫోన్ పే ద్వారా పంపించిందని, వాటిని ఏటీఎం ద్వారా డ్రా చేసి సాయిరెడ్డికి ఇచ్చానని తెలిపారు. ఏసీబీ అధికారులు ఈ కేసులో తన పేరు చేర్చడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

మీసేవ కేంద్రం సీజ్

తాండూర్: వినియోగదారుల వద్ద నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఓ మీసేవ కేంద్రాన్ని సీజ్ చేసినట్లు తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు. తాండూర్ మండల కేంద్రంలోని మీసేవ కేంద్రం నిర్వాహకుడు భీమ ప్రవీణ్ వినియోగదారుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో విచారణ జరిపి మీసేవ కేంద్రాన్ని సీజ్ చేసి కలెక్టర్‌కు నివేదిక పంపామని తహసీల్దార్ తెలిపారు.

రజతోత్సవ సభ విజయవంతం చేయండి



వాల్ రైటింగ్ ఆవిష్కరణలో బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజా రమేశ్ పిలుపునిచ్చారు. చెన్నూర్‌లో పట్టణంలో రజతోత్సవ సభ వాల్ రైటింగ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అయిత సురేశ్‌రెడ్డి, కృష్ణ, అనిల్, మహేశ్, మహేందర్, అశోక్, జడల మల్లేశ్, భారతి, నాయబ్ పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బందులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఎండి అఫ్జల్ ఒక ప్రకటనలో తెలిపారు. పగలు, రాత్రి తేడా లేకుండా గంటల తరబడి విద్యుత్‌సరఫరా నిలిపి వేస్తుండటంతో పిల్లలతో పాటు పెద్దలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని తెలిపారు. విద్యుత్ అధికారులు కరెంట్ కోతలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయడానికే అధికారులు కొందరు అనాలోచిత విధానాలను అవలంభిస్తున్నట్లు పురప్రజలు బాహాటంగానే మాట్లాడుకుంటున్నారని తెలిపారు. మెరుగైన విద్యుత్ సరఫరాకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

నేడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే పర్యటన

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో ఆదివారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పర్యటించనున్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఉదయం 7గంటలకు మందమర్రి బీ–1 పార్టీ కార్యాలయం ప్రారంభం, 8గంటలకు 3, 14వార్డుల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, 9:30గంటలకు జైపూర్ రైతువేదిక భవనంలో భూభారతి అవగాహన సదస్సులో పాల్గొంటారు. 10:30గంటలకు భీమారం మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఇరిగేషన్ మరమ్మతు పనుల పరిశీలన, 11గంటలకు చెన్నూర్ మైనార్టీ ఫంక్షన్ హాల్లో జరిగే భూభారతి చట్టం –2025పై రైతులకు నిర్వహించే అవగాహన సదస్సులో కలెక్టర్‌తో కలిసి పాల్గొంటారు. అభివృద్ధి పనులు, కార్యక్రమాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

రక్తదాన శిబిరం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ వెస్లీ చర్చిలో శనివారం రక్తదాన శిబిరాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 25మంది స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేసినట్లు బ్లడ్‌బ్యాంక్ మేనేజ్‌మెంట్ కమిటీ సొసైటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు సూపర్‌వైజర్ మాధవి, స్టాఫ్ నర్సు రజిత, టెక్నీషియన్ రవివర్మ పాల్గొన్నారు.

వాల్ రైటింగ్‌పై రగడ

- మున్సిపల్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

చెన్నూర్: చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ కాంగ్రెస్ ఎమ్మెల్యేకు తొత్తుగా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజా రమేశ్ ఆరోపించారు. వరంగల్‌లో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కోసం చెన్నూర్ మున్సిపాలిటీలో వాల్ రైటింగ్ రాయగా, కమిషనర్ దానిపై సున్నంవేసి చెరిపేయడాన్ని నిరసిస్తూ శనివారం మున్సిపల్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు బైఠాయించి నిరసన తెలిపారు. కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ కమిషనర్ కేవలం బీఆర్ఎస్ పార్టీ వాల్ రైటింగ్‌ను సున్నంతో చెరిపేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే మెప్పు కోసం బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే సహించేదిలేదన్నారు. కాంగ్రెస్ కోసం పని చేయాలని ఉంటే ఉద్యోగానికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వాల్ రైటింగ్ చెరిపేసిన స్థానంలో కమిషనర్ మళ్లీ వాల్ రైటింగ్ రాయించాలని, లేనట్లెతై పెద్ద ఎత్తున కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణ, ఎంపీపీ మంత్రి బాపు, మాజీ కౌన్సిలర్లు రెవెల్లి మహేశ్, జోడు శంకర్, శ్రీనివాస్, సుధాకర్, బీఆర్ఎస్ నాయకులు మేడ సురేశ్‌రెడ్డి పెండ్యాల లక్ష్మణ్, పాశం ఆశీశ్‌లు పాల్గొన్నారు.

అంధకారంలో బైపాస్ రోడ్డు

మంచిర్యాల బైపాస్ రోడ్డులో వీధిదీపాలు వెలగకపోవడంతో చీకట్లు కమ్ముకున్నాయి. దుకాణాలు, ఏదైనా వాహనాలు వెళ్లినప్పుడు వచ్చే వెలుతురు మాత్రమే ఉండగా, వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానిక ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. వెంటనే వీధి దీపాలు వెలిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– మంచిర్యాలటౌన్



క్రైం స్పాట్లు గుర్తించాలి

- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు



డ్రోన్ ద్వారా పరిశీలిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

శ్రీరాంపూర్: ఏరియాలో క్రైం హాట్ స్పాట్‌లను గుర్తించాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 కొత్తరోడ్, తదితర ఏరియాల్లో శనివారం ఆయన క్రైం హాట్‌స్పాట్ ప్రాంతాలను డ్రోన్ ద్వారా పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు క్రైం హాట్‌స్పాట్‌ల వద్ద పెట్రోలింగ్, నిఘా ఏర్పాటు చేయాలన్నారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొనేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సీఐ వేణుచందర్, ఎస్సై సంతోశ్ పాల్గొన్నారు.

నేర నిరూపణలో సీసీ కెమెరాలు కీలకం

- బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్



కెమెరాలు ప్రారంభిస్తున్న ఏసీపీ

రామకృష్ణాపూర్: నేరాలను నిరూపించటంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమైనదని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. మందమర్రిలోని ప్రాణహిత కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు ఏర్పాటు వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయన్నారు. కేసుల ట్రయల్ సమయంలో సీసీ కెమెరాలు సాక్ష్యంగా నిలుస్తాయన్నారు. ప్రతీ కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షన్ పెంపుపై హర్షం



ఆర్‌కేపీలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



చెన్నూర్‌లో ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం

చెన్నూర్/రామకృష్ణాపూర్: సింగరేణి రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ పెంపుపై కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ నాయకులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. రామకృష్ణాపూర్ పార్టీ కార్యాలయం, చెన్నూర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద, మందమర్రిలో పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రగిరి ఎల్లయ్య, గంగయ్య, సుధాకర్, మందమర్రిలో జరిగిన కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, రమేశ్, శ్రీనివాస్, చెన్నూర్‌లో మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్‌రావు, కాంగ్రెస్ నాయకులు హిమవంతరెడ్డి, చెన్న సూర్యనారాయణ, రాజమల్లగౌడ్, పాతర్ల నాగరాజు, చెన్నూరి శ్రీధర్, అన్వర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ బహిష్కరణ

శ్రీరాంపూర్: సింగరేణి సీఎండీ వీడియో కాన్ఫరెన్సును తాము బహిష్కరించినట్లు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ సెంట్రల్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచీ కార్యదర్శి షేక్ బాజీసైదా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నైనీ బ్లాక్ ప్రారంభించిన సందర్భంగా సీఎండీ వీడియో కాన్ఫరెన్సు ద్వారా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు అభినందనలు తెలిపే కార్యక్రమం చేపట్టారన్నారు. ఐతే కొన్ని ఏరియాల్లో కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌కు భిన్నంగా ఎక్కడ గెలువలేని సంఘాల నేతలను కూడా వీడియో కాన్ఫరెన్సులోకి తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అందుకే ఈ కార్యక్రమాన్ని బహిష్కరించినట్లు తెలిపారు. ఇప్పటికైనా యాజమాన్యం కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌ను పాటించాలని డిమాండ్ చేశారు.

బొగ్గుబాయి వార్తలు

గనిపై నాయకుల ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని కేకే –5 గనిపై శనివారం ఏఐటీయూసీ నాయకులు ఆందోళన చేపట్టారు. గనిలో నెలకొన్న సమస్యలను మేనేజర్ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించకుండా నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అతని తీరు మారకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి కార్యదర్శి సలెంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఐడీ కార్డులివ్వాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఐడీ కార్డులను సంస్థ పంపిణీ చేయాలని బీఎంఎస్ నాయకులు కోరారు. ఆ యూనియన్ జేబీసీసీఐ సభ్యుడు పీ మాదవ్‌నాయక్ ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శనివారం సంస్థ సీఎండీ బలరాం నాయక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు జీవీ కృష్ణారెడ్డి, ఉట్ల గణేశ్, శ్యాంలాల్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో సంవిధాన్ పాదయాత్ర

- రాజ్యాంగ సవరణ యత్నాలతో రిజర్వేషన్లకు ముప్పు
- డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ



ర్యాలీలో పాల్గొన్న సురేఖ, నాయకులు

నస్పూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): దేశంతో పాటు రాజ్యాంగాన్ని కాపాడుకుందామనే ఏఐసీసీ పిలుపుతో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం హాజీపూర్ మండలంలోని ర్యాలీ, చిన్నగోపాల్‌పూర్, నాగారం, గఢ్‌పూర్ గిరిజన గ్రామాల్లో, నస్పూర్‌లో రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలను చైతన్యం చేసే దిశగా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులతో కలిసి పెద్ద ఎత్తున పాదయాత్ర చేపట్టారు. కేంద్రం రాజ్యాంగ సవరణ కోసం చేస్తున్న ప్రయత్నాలతో రిజర్వేషన్ల ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని మరిచి కుల,మతాల మధ్య చిచ్చుపెట్టేలా బీజేపీ వ్యవహరిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మ, నాయకులు చింత పండు శ్రీనివాస్, కొటె సత్తయ్య, రఫీక్, రాజలింగు, నస్పూర్‌లో మున్సిపల్ మాజీ చైర్మన్ సురమిల్ల వేణు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు.

ఘనంగా 'రన్‌ఫర్ జీసస్'



ఆర్‌కేపీలో రన్‌లో పాల్గొన్న క్రైస్తవులు

లక్సెట్టిపేట/రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణంలోని కార్మికవాడల్లో శనివారం రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా చర్చీలకు చెందిన క్రైస్తవులు ఈ రన్ లో ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక రాజీవ్‌చౌక్‌లో ప్రారంభమైన రన్ సూపర్‌బజార్ మీదుగా సీఎస్ఐ చర్చి వరకు సాగింది. ఏసుక్రీస్తు సిలువ మరణం పొంది మూడో రోజున సజీవుడిగా తిరిగిలేచిన శుభవార్తను ప్రజలకు తెలియచేసేందుకు యేసు కోసం పరుగు అనే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. మందమర్రిలోనూ రన్‌ఫర్‌జీసస్ నిర్వహించారు. లక్సెట్టిపేట సీఎస్ఐ చర్చిలో రన్‌ఫర్‌జీసస్ వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి బస్టాండ్ సీఎస్ఐ చర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి ఫాధర్ డేవిడ్ పాల్, క్రైస్తవులు పాల్గొన్నారు.

అలరించిన వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న బాలికలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి బజారు ఏరియా పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మండల విద్యాధికారి పోచయ్య, ప్రధానోపాధ్యాయులు రఘుబాబు, సెక్టోరల్ అధికారి సత్యనారాయణ మూర్తి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ రెడ్డి, సాధు లింగయ్య, వై.సత్యనారాయణ హాజరయ్యారు.

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఖేలో ఇండియా బాక్సింగ్ సెంటర్ క్రీడాకారులు ఇద్దరు జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఖేలో ఇండియా బాక్సింగ్ శిక్షకులు సీహెచ్.రాజేశ్ తెలిపారు. 7వ యూత్ ఉమెన్స్ జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఓ.సంస్కృతి ఎంపిక కాగా, ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు గ్రేటర్ నోయిడా, ఉత్తర్‌ప్రదేశ్‌లో జరిగే బాక్సింగ్ పోటీల్లో 65నుంచి 70కేజీల విభాగంలో తెలంగాణ రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. 68వ స్కూల్ గేమ్స్ సబ్ జూనియర్ బాయ్స్ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు జి.శ్రీనాథ్ ఈ నెల 22వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఢిల్లీలో జరగబోయే ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో 28 నుంచి 30కేజీల విభాగంలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

కాసిపేట: వేమనపల్లి మండలం మంగేనపల్లికి చెందిన ఆదివాసీ నాయిని కన్నయ్య మృతికి నిరసనగా ఈ నెల 21, 22న జిల్లా వ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చినట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి తెలిపారు. మండలంలోని సోమగూడెం ట్యాంక్‌బస్తీలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అతడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి సంకె రాజకుమారి, బ్రహ్మయ్య, రజిత, మణి తదితరులున్నారు.

టైగర్‌జోన్ ఎత్తివేయాలని వినతి

జన్నారం: టైగర్‌జోన్ సమస్యలపై శనివారం తెలంగాణ ప్రజాఫ్రంట్, సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ రాజా మనోహర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చా రు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని టైగర్‌జోన్ ఎత్తివేయాలని లేదా నిబంధనలు సడలించాలని ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కార్యదర్శి జైపాల్‌సింగ్, సీపీఎం మండల కార్యదర్శి కనికరం అశోక్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

భీమిని: మండలంలోని చిన్నగుడిపేటకు చెందిన పెసరి రాజన్న, బీరయ్య, కెస్లాపూర్‌కు చెందిన రజితలకు శనివారం సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్‌బాబు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

చెట్ల నరికివేతపై కేసు నమోదు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం బుద్ధిపల్లి గ్రామంలోని ప్రకృతివనంలోని చెట్లను నరికినందుకు, అదే గ్రామానికి చెందిన ముడిమడుగుల లింగయ్యపై హాజీపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. కార్యదర్శి రఘు ఫిర్యాదుతో లింగయ్యపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు.

బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై..

నెన్నెల: మండలంలోని ఓ గిరిజన తండాకు చెందిన 15ఏళ్ల బాలికపై భుక్య సుమన్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదుతో శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

నేడు భూభారతిపై అవగాహన

భీమారం: మండల కేంద్రంలోని రైతువేదికలో ఆదివారం భూభారతి–కొత్త ఆర్వోఆర్ చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సదానందం తెలిపారు. ఈ సదస్సుకు కలెక్టర్ కుమార్‌దీపక్ హాజరుకానున్నట్లు తెలిపారు.

23న నీల్వాయిలో...

వేమనపల్లి: నీల్వాయి రైతువేదికలో ఈ నెల 23న భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రమేష్ తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ కుమార్‌దీపక్ అధ్యక్షత వహించనున్నట్లు తెలిపారు.

జర్నలిస్టు కుటుంబానికి పరామర్శ

నెన్నెల: జర్నలిస్టు రేణికుంట్ల వెంకటేశ్వర్ కుటుంబాన్ని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య శనివారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాగర్, నాయకులు ఇబ్రహీం, పురుంశెట్టి తిరుపతి, తోట మధు ఉన్నారు.

యువకులకు కౌన్సెలింగ్

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బంగారు మైసమ్మ ఆలయం సమీపంలో శనివారం కొందరు యువకులు బహిరంగంగా మద్యం సేవించారు. వారికి తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో సీఐ అఫ్జలొద్దీన్ కౌన్సెలింగ్ ఇచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్సై రమేశ్, సిబ్బంది ఉన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

జన్నారం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆరో రోజు మండల కేంద్రంలోని లిటిల్ హాన్స్ పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అగ్ని ప్రమాదాలపై ఫైర్ అధికారి శ్రీనివాస్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఫైర్ సిబ్బంది శివకృష్ణ, కళ్యాణ్, ఉదయ్‌కిరణ్, శ్రీనివాస్, చంద్రయ్య, విద్యార్థులు తదితరులున్నారు.

ఓపెన్ స్కూల్ ఫీజు తిరిగి చెల్లింపు

జన్నారం: ఓపెన్ స్కూల్లో చేరిన విద్యార్థులకు సర్వశిక్ష అభియాన్ నుంచి వారు చెల్లించిన ప్రవేశ రుసుం తిరిగి చెల్లిస్తున్నట్లు మండల విద్యాధికారి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కవ్వాల్ గ్రామానికి చెందిన కొల్లురు మహేశ్‌కు శనివారం చెల్లించినట్లు తెలిపారు. కవ్వాల్ ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాస్, సీఆర్పీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువవికాసం దరఖాస్తులు పరిశీలించాలి

భీమారం: రాజీవ్ యువవికాసం దరఖాస్తులను గ్రామస్థాయిలో పరిశీలించాలని ఎంపీడీవో మధుసూధన్ కార్యదర్శులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీవో సతీష్‌రెడ్డి, ఏపీవో జీనత్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు

భీమిని: కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సూర్జాపూర్‌లో శనివారం పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పలు ఇళ్లలో నకిలీ విత్తనాలు ఉన్నాయన్న సమాచారంతో ఎస్సై గంగారాం సిబ్బందితో కలిసి సోదాలు నిర్వహించారు.

క్రీడా దినోత్సవం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం క్రీడా దినోత్సవం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంవి.పట్వర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్‌కుమార్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.